గుంటూరు ఛానల్ పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలి

– ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు ఛానల్ పనులు యుద్ధప్రాతి పదికన చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి కోరారు. గుంటూరు మల్లయ్య లింగంభవన్‌లోని రైతు సంఘం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుంటూరు ఛానల్‌లో పేరుకు పోయిన గుర్రపు డెక్క, తూటు కాడా తొలగింపుకు గత ప్రభుత్వంలో రూ.1.20 కోట్లు మంజూరు చేసిందని, అయితే గత సంవత్సరం జులై 7వ తేదిన నీరు వదలడంతో ఛానల్‌లో పూడిక తొలగింపు తూతూమంత్రంగా చేశారన్నారు. ఈ సంవత్సరం రూ.1.30 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారని, నూతన ప్రభుత్వం తక్షణమే స్పందించి ఛానల్‌కు నీరు విడుదల చేయకముందే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సుమారు 47 కిలోమీటర్ల పొడవున్న ఈ ఛానల్ 30 గ్రామాలకు తాగు నీరు, 30 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తుందన్నారు. ఈ కాలువకు పెదకాకాని లాకుల వద్ద గండి పడిందని, దీనిని పూడ్చాలని, ఆటో నగర్, మానససరోవరం వద్ద డ్రైనేజీ నీరు ఈ కాలువలోకి కలుసుందని, దీనికి మరమ్మత్తులు చేయాలన్నారు. జల్లవాగు వద్ద పూడిపోయిందని, దీనివలన సుమారు 2 వేల ఎకరాలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. పూడికతీసి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. అంతే కాకుండా పెద్దవడ్లపూడి హై లెవల్ ఛానల్‌ను అభివృద్ధి పరచాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ఈ ఛానల్ అభివృద్ధికి రూ.9 కోట్లు కేటాయించగా రూ.5.50 కోట్లతో పనులు చేశారని, మిగిలిన రూ.3.50 కోట్లు మంజూరు చేసి ఛానల్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు.

రెండు నెలలు పాటు 'స్టాప్ డయేరియా క్యాంపెయిన్'

– డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : జులై 1వ తేదీ నుంచి అగస్టు 31వ తేదీ వరకు రెండు నెలల పాటు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ కొనసాగుతుందని గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ (డీఎంహెచ్ఓ)డాక్టర్ కొర్రా విజయలక్ష్మి పేర్కొన్నారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ అతిసార నియంత్రణ మాసోత్సవాలలో భాగంగా ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్ హెచపీలు 5 సంవత్సరాల పిల్లలు ఉన్న ఇళ్లలో ఓఆర్ఎస్ జింక్ మాత్రలు అందజేస్తారన్నారు. 5 సంవత్సరాలు పైబడిన వయసు వారికి విరోచనాలు మొదలైన వెంటనే ఓఆర్ ఎస్ ద్రావణం ఇవ్వాలన్నారు. 2 నుంచి 6 నెలల శిశువులకు అరమాత్ర జింక్ (10ఎంజీ), 6 నెలల నుంచి 5 సంవత్స రాల పిల్ల లకు ఒక జింక్ మాత్ర (20ఎంజీ)14 రోజులు పాటు అందజేయడం జరుగుతుందన్నారు. పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సచివాల యాలు, హెల్త్ వెల్నెస్ సెంటర్లలో, ఓఆర్ఎస్, జింక్ కార్నర్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'మన్ కీ బాత్' వీక్షించిన డాక్టర్ అరుణ, డా.ఉమా శంకర్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నిర్వహించిన 'మన్ కి బాత్' కార్యక్రమాన్ని అహల్య హాస్పిటల్స్ నందు మాజీ మంత్రి డాక్టర్ శనక్కాయల అరుణ, ప్రముఖ సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్ హాస్పటల్ సిబ్బంది, పేరెంట్స్‌తో కలిసి ఆదివారం వీక్షించారు.

నేడు జీఎంసీలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

విశాలాంధ్ర-గుంటూరు : ప్రజల నుంచి త్రాగునీటి సరఫరా, వీధి దీపాలు, పారిశుద్యం, వంటి స్థానిక సమస్యలపై అందే ఫిర్యాదులు స్వీకరణకు జీఎంసీలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పబ్లిక్ గ్రీవెన్స్ రీడర్స్ సిస్టం(పీజీఆర్ఎస్)) జరుగుతుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీఆర్ ఎస్ సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుంచి పీజీఆర్ఎస్ జరుగుతుందని, సదరు కార్యక్రమంలో తమతో పాటుగా నగరపాలక సంస్థ ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య విభాగాధిపతులు, డిప్యూటీ కమిషనర్లు, అధికారులు పాల్గొంటారని అన్నారు.

అన్న క్యాంటీన్‌లకు నెల పెన్షన్ విరాళం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించబోతున్న అన్న క్యాంటిన్‌లకు గుంటూరుకు చెందిన విశ్రాంత సైనికోద్యోగి ఆళ్ల రాఘవరావు ఒక నెల పెన్షన్ రూ.35 వేలు ముఖ్య మంత్రి సహాయ నిధికి విరాళంగా ఆది వారం ప్రకటించారు. పేదలకు ఎంతో ఉపయోగ'పడే ఈ కార్యక్రమానికి తన వంతు సహకారం అందిస్తున్నానని, తమ వంతు బాధ్యతగా అందరూ సహకరించాలరి కోరారు. గుంటూరు అరండల్‌పేటకు చెందిన సూర్య తేజ సెక్యూరిటీ సర్వీసెస్ అధినేత ఆళ్ళ రాఘవరావు విరాళాన్ని ప్రకటించారు. ఆర్మీలో ఎలక్ట్రికల్ మెకానికల్ ఇంజనీర్ విభాగంలో నాన్ కమిశండ్ ఆఫీసర్ (ఎన్‌సీఓ) 1978 నుంచి 1993 వరకు వివిధ రాష్ట్రాల్లో సేవలు అందించారు. పేదలకు ఎంతో ఉపయోగపడే అన్న క్యాంటీన్‌లకు తన వంతు బాధ్యతగా ఈ విరాళాన్ని ప్రకటిస్తు న్నట్లు ఆయన చెప్పారు. తన నెల పెన్షన్‌ను ముఖ్యమంత్రి సహాయ నిధికి ఇస్తున్నట్లు రాఘవరావు వెల్లడించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి రూరల్ పరిధిలో గుర్తుతెలియని మృతదేహాన్ని రూరల్ పోలీసులు గుర్తించారు. రూరల్ ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం మంగళగిరి మండల రూరల్ ప్రాంతమైన చిన్నకాకాని గ్రామంలోని హాయ్ ల్యాండ్ సమీపంలో గోడౌను పక్కన పాత నివాస గృహం పైన గుర్తుతెలియని మృతదేహాన్ని పోలీసులు ఆదివారం గుర్తించారు. ఈ గుర్తుతెలియని మృతదేహం సుమారు 50 నుంచి 55 సంవత్సరాలు వయస్సు ఉంటుందని, ఒంటిపై టీ షర్టు ఉందని రూరల్ పోలీసులు తెలిపారు. మృతదేహానికి సంబంధించి సమాచారాన్ని రూరల్ పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని రూరల్ పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రూరల్ ఎస్సై జె.క్రాంతి కిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

IN THE COURT OF THE 1ST ADDL. JUNIOR CIVIL JUDGE ONGOLE

IA No. 327/2023 & IA No. 328/2023 IN OS No. 505 /2023

Between
VEMURI SRINIVASULU
- PLAINTIFF/ PETITIONER.
AND
GURRAM PADMAVATHI & OTHERS
- DEFENDANTS/ RESPONDENTS

NOTICE

To
GRANDHI SUBHASHINI,
W/o.G. Rajesh, age 33 years, Housewife, C/o. Grandhi Mohan Rao, Gunturuvari thota, **GUNTUR.**

The petitioner plaintiff filed the above suit for relief in the above case. If you have got any objection you may appear before this court at **10-30 AM., on 22nd July. 2024** either in person or through an advocate and filed your objection. If you fail to do so, the matter will be decided as per law and records.

(By order in the name of the Hon'ble Court)

BADDIPUDI SRINIVASA RAO,
Advocate,
35-4-69, Sitarampuram, ONGOLE

పంటలు సాగుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలి

- కల్తీ విత్తనాలు, నకిలీ పురుగుమందులు అమ్మే వారిపై కఠిన చర్యలు
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: జిల్లాలో రైతులకు పంటల సాగులో ఇబ్బందులు లేకుండా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించటంతో పాటు, పంట రుణాలు, సక్రమంగా సాగునీరు, లాభదాయకమైన సాగు యాజమాన్య పద్దతులపై అవగాహన కల్పించేలా వ్యవసాయశాఖ, అనుబంధ శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా.పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో కేంద్ర మంత్రి డా.పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ, శాసనసభ్యులు నసీర్ అహ్మద్, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ కుమార్, సంయుక్త కలెక్టర్ జి రాజకుమారితో కలసి జిల్లాలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో వ్యవసాయశాఖ అనుబంధశాఖల వివరాలు, సాగు భూముల వివరాలు, మండలాలు వారీగా సాగు చేస్తున్న పంటల వివరాలు, ఇరిగేషన్ కాల్వలు, వర్షపాతం వివరాలు, విత్తనాల సరఫరా, ఎరువులు లభ్యత, వినియోగం, కౌలు రైతు కార్డులు, భూసారా పరీక్షలు, ఉద్యాన పంటలు, ప్రకృతి వ్యవసాయం, రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు తదితర అంశాలపై జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, ఇతర అనుబంధశాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజేంటేషన్ ద్వారా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు వివరించారు. జిల్లాలో ఉన్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా దీర్ఘకాలికంగా సాగు చేస్తున్న పంటలకు ప్రత్యామ్నాయంగా ఇన్నో వేషన్ పంటలు సాగు చేసేందుకు ఉన్న అవకాశాలపై ప్రతిపాదనలను సిద్దం చేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలకు సూచించారు. లాభదాయక పంటల సాగు పై రైతులకు వ్యవసాయశాఖ అధికారులు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం సబ్సిడీపై అందించే విత్తనాలను రైతులందరికీ అందేలా అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో పేదరైతులు పంటదిగుబడులు నష్టపోవటానికి కారణం అవుతున్న నకిలీ ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అరికట్టేందుకు విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ట్రాన్స్ పోర్ట్ ద్వారా వచ్చే నకిలీ ఎరువులు, పురుగు మందులు, విత్తనాలపైన నిఘాపెట్టి చర్యలు తీసుకోవాలన్నారు. దీనికి ప్రజా ప్రతి నిధులు, రాష్ట్ర ప్రభుత్వం అధికారులకు పూర్తి సహకారం అందిస్తున్నామన్నారు. జిల్లాలో నిబంధనలు పాటించకుండా ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల విక్రయాలపై పిర్యాదులను ఇచ్చేందుకు ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నెంబరు ఏర్పాటు చేయాలని, దీనిని ప్రతి వ్యాపార సంస్థ వద్ద ప్రదర్శించాలన్నారు. టోల్ ఫ్రీ నెంబరుకు వచ్చిన ప్రతి ఫిర్యాదును పూర్తి స్థాయిలో పరిష్కరించేం దుకు చర్యలు తీసుకోవాలని, వివరాలను ప్రజాప్రతి నిధులు, ఉన్నతాధికారులు పరిశీలించేలా రిజిస్టర్ చేయాలన్నారు. జిల్లాలో కౌలు రైతులందరికీ పంట రుణాలు అందించేలా వ్యవసాయ శాఖ, రెవెన్యూ, బ్యాంకు అధికారులు సమన్వ యంతో చర్యలు తీసుకోవాలని, దీనిపై ఉన్న నిబంధనలను సరళతరం చేసి నిజమైన కౌలు రైతులకు బ్యాం కులు రుణాలు అందించేందుకు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్ళి చర్చించటం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశ పెట్టిన పథకాలను మంచిగా అమలు చేస్తున్న రాష్ట్రలకు సంబంధించిన వివరాలను సేకరించి, అవే విధానాలను జిల్లాలోను అనుసరించేందుకు అవసరమైన నివేదిక అందించాలన్నారు. భూసార పరీక్షలు, విత్తనాలు, ఎరువులు శాంపిల్స్ పరీక్షలు సక్రమంగా నిర్వహించా లన్నారు. జిల్లాలో ఇరిగేషన్‌కు సంబంధించి ప్రధాన, మేజరు, మైనర్ కాల్వలతో పాటు, పంట కాల్వ లు పూర్తి స్థాయిలో గుర్రపు డెక్క తొలగించి, సాగునీరు సక్రమంగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్, బూర్ల రామాంజ నేయులు, నసీర్ అహ్మద్ వివిధ అంశాలపై సూచనలు అందిస్తూ జిల్లాలో భారీ స్థాయిలో నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల విక్రయాలు చేసే కంపెనీల పై తొలుత తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తే ఇతర విక్రయదారుల్లోను మార్పువచ్చే అవకాశం ఉంటుందన్నారు. భూయజమానులు కాకుండా, వాస్తవంగా భూమి కౌలు రైతులకే పంట రుణాలు అందించే చర్యలు తీసుకోవాలన్నారు. జీడీసీసీ బ్యాంకులో రైతుల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా రుణాలు మంజూరు, ఇతర ఆర్థిక అవకతవకలపై అసలు సూత్రదారులపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్పీ కే.ఈశ్వరరావు, జిల్లా మత్యశాఖ అధికారి గాలి దేముడు, జిల్లా ఏపీఎంఐ పీడీ వజ్రశ్రీ, జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ ఉమామహేశ్వరరావు, లాం ఏడీఆర్ దుర్గాప్రసాద్, కెవీవీ సత్యనారాయణ పశు సంవర్ధక శాఖ, మార్క్ఫెడ్ సీఓ శేషశ్రీ, ఏపీసీఎన్ఎఫ్ పీడీ రాజకుమారి, లీడ్ బ్యాంక్ మేనేజరు మహిపాల్ రెడ్డి, మార్కెటింగ్ ఏడీ రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

పెమ్మసానికి కంటిన్జెంట్ స్వీపర్స్ వినతిపత్రం

విశాలాంధ్ర- తెనాలి : తెనాలి పురపాలక సంఘ పరిధిలోని ప్రాధమిక మరియు ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న కంటిన్జెంట్ స్వీపర్స్ బుర్రిపాలెం వచ్చిన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖరరావుకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. పురపాలక సంఘంలోని పలు పాఠశా లలో పని చేస్తున్న 40 మంది సుమారు 20 నుండి 25 సంవత్సరాల నుండి పని చేస్తున్నామని, ఉదయం 7 నుండి సాయంత్రం 5 గంటల వరకు తరగతి గదులు, పరిసరాలు శుభ్రం చేయడం వంటి పరిశుభ్రతా కార్యక్రమాలు చేస్తున్నామని, తమకు ప్రభుత్వం నుండి కేవలం 4000 రూపా యలు మాత్రమే ఇస్తున్నారని, అదీ కూడా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఖాతాకు జమ చేస్తున్నారని విన్నవించుకున్నారు. తాము చేసే కష్టాన్ని పరిగణనలోకి తీసుకుని తమకు జీతాలు పెంచి ఆయా పాఠశాలల్లో తమ స్వీపర్ పోస్టులను పర్మినెంట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధికల్పనే లోకేష్ లక్ష్యం

విశాలాంధ్ర-మంగళగిరి : మానవవనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీ శాఖల మంత్రి నారా లోకేశ్ సహకారంతో మంగళగిరి నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు హెచ్‌సీఎల్ కంపెనీలో ఇంటర్న్‌షిప్‌తో కూడిన ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు టీడీపీ నేతలు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023-2024 విద్యా సంవత్సరాలలో ఇంటర్మీడియట్ ఒకేషనల్, సీఈసీ, హెచ్ఎస్‌సీ, బైపీసీలో 75 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి మెరుగైన కమ్యూనికేషన్ స్కిల్ కలిగి ఉండాల న్నారు. మొత్తం సంవత్సరం పాటు శిక్షణ కాలంలో మధురైలో మూడు నెలలు, చెన్నైలో 9 నెలల పాటు శిక్షణ తీసుకోవాల్సి ఉంటుందన్నారు. మొదటి మూడు నెలల తర్వాత ప్రతినెలా రూ.10 వేల గౌరవ వేతనం, శిక్షణ పూర్తయిన తర్వాత ఏడాదికి కనీసంగా రూ.1.70 లక్షల ప్యాకేజీతో కూడిన వేతనం అందుతుందన్నారు. వివరాలకు 8367608888, 9553910733 నెంబర్లకు కానీ, మంగళగిరి డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో కానీ సంప్రదించాలని సూచించారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు విస్తృతమైన ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో మంత్రి నారా లోకేష్ పనిచేస్తున్నట్లు పార్టీ నేతలు తెలిపారు.

శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపిన సుందరరావు యాదవ్

విశాలాంధ్ర-తాడేపల్లి : టీడీపీ రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన పల్లా శ్రీనివాసరావును టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్ రాష్ట్ర టీడీపీ కార్యాలయంలో కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. దానబోయిన సుందరరావు యాదవ్ మాట్లాడుతూ 2024 ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో గాజువాక నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థి, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ పై పల్లా శ్రీనివాసరావు రాష్ట్రంలోనే అత్యధికంగా 95,235 ఓట్ల తేడాతో విజయం సాధించారని అన్నారు. సాధికార రాష్ట్ర యాదవ్ కన్వీనర్ వై.నాగేశ్వరరావు, రైతు సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షులు బుర్రముక్కు శ్రీనివాస్ రెడ్డి, తాడిబోయిన భాస్కర్, వెంకన్న, ఎం.యేసుబాబు, భక్తుల శ్రీనివాసరావు, పి.నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కంటి వ్యాధులుపై నిర్లక్ష్యం తగదు

– నేత్ర వైద్య నిపుణురాలు డాక్టర్ పద్మప్రియ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : బయట ప్రపంచానికి మనకూ సంబంధం ఏర్పరిచే పంచేంద్రియాలలో అతి ముఖ్యమైన కన్ను విషయంలో అప్రమత్తంగా ఉండాలని, కంటి వ్యాధులుపై నిర్లక్ష్యం తగదని శంకర్ కంటి హాస్పిటల్ కన్సల్టెంట్, నేత్ర వైద్య నిపుణురాలు డాక్టర్ పద్మప్రియ అన్నారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో 'కంటి సమస్యలు-చికిత్స' అనే అంశంపై ఆదివారం ఆరోగ్య సభ అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ పద్మప్రియ మాట్లాడుతూ నలభై ఏళ్లు పైబడిన వారు కంటి వ్యాధులుపై అప్రమత్తంగా ఉంటూ సమస్యలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్లను సంప్రదించాలన్నారు. శుక్లాలు, నీటి కాసులు, కంటి కలక, రెటీన లేడీ జార్డర్స్, ఐలిడే సమస్యలు లాంటి కంటి వ్యాధులు ఈ మధ్య చాలా ఎక్కువగా వస్తున్నట్లు చెప్పారు. 40 ఏళ్ళ తరువాత వివిధ కంటి సమస్యలు ఎదురవుతూ ఉంటాయని, సమస్యను సత్వరమే గుర్తించి కళ్ళద్దాలు వాడటంతో ఆ సమస్యకు కొంతవరకు పరిష్కారం దొరుకుతుందని పేర్కొన్నారు. చూపుకి అడ్డంపడి చికాకును కలిగించే ఫ్లోటర్స్ సమస్య ఉన్నపుడు మాత్రం డాక్టర్‌ను సంప్రదించాలని కోరారు. వృద్ధాప్యంలో డ్రై ఐస్ పరిస్థితి ఏర్పడినపుడు కంటిని తడిగా ఉంచటానికి ప్రత్యేకమైన ఐడ్రాప్స్ వాడాలని సూచించారు. కంటిలో నీళ్లు ఎక్కువగా కారే వాళ్లు కూలింగ్ అద్దాలు వాడాలని, ఇన్‌ఫెక్షన్ల వల్ల..కొన్ని కెమికల్స్ సోకటం వల్ల..ఎలర్జి వల్ల వచ్చే కంటి కలక వ్యాధి గురించి డాక్టర్‌ను కలవాలన్నారు. కంటికి సంబంధించిన ప్రధాన సమస్య గ్లకోమా అని పిలవబడే నీటి కాసుల వ్యాధి అని, కంటిలో ఫ్లూయిడ్ ఎక్కువగా ఉండటం వల్ల గ్లకోమా పరిస్థితి నెలకొంటుందన్నారు. రక్తపోటు, మధుమేహ వ్యాధులు కంటి నరాన్ని డ్యామేజ్ చేస్తాయని ఈ సందర్భంగా డాక్టర్ పద్మప్రియ గుర్తు చేశారు. ఈ ఆరోగ్య సభలో శంకర్ కంటి హాస్పిటల్ పీఆర్వో కాళీ ప్రసాద్, ఐ బ్యాంక్ కోఆర్డినేటర్ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పల్లపు ప్రాంతాలు జలమయం

విశాలాంధ్ర-తాడికొండ : ఆదివారం వేకువజాము నుంచి ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పంట పొలాల్లో నీరు చేరింది. ప్రధాన రహదారులు వెంట ఉన్న కుంటలు నిండాయి. రహదారులపైకి నీరు చేరింది. ఎస్సీ, ఎస్టీ కాలనీలో రహదారులు బురదమయంగా మారాయి. వర్షంతో పాటు చలి గాలులు వీస్తున్నాయి.

బందెల నాసర్ జీ ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యునిగా ఎన్నిక

▲ హర్షం వ్యక్తం చేసిన జిల్లా నాయకులు

విశాలాంధ్ర-గుంటూరు : ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సమావేశాలు ఈ నెల 29, 30 తేదీలలో తిరుపతి బైరాగి పట్టెడలోని సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు విక్కీ మహేశ్వరి అధ్యక్షతన జరిగాయి. ఈ సమావేశాల్లో గుంటూరు నగరానికి చెందిన ఏఐఎస్ఎఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ జాతీయ కార్యవర్గ సభ్యునిగా ఎన్నికయ్యారు. గుంటూరు జిల్లాకు చెందిన విద్యార్థి, యువజన సంఘాల నాయకులు హర్షం వ్యక్తంచేశారు.

రజకుల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యం : ఎమ్మెల్యే మాధవి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: రజకుల అభ్యున్నతి తెలుగుదేశం పార్టీతో నే సాధ్యమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యురాలు గళ్ళా మాధవి పేర్కొన్నారు. స్థానిక అమరావతి రోడ్డులో అన్నదాన సత్రంలో రజక సోదరుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మాధవి అభినందన సభ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ను ఘనంగా సత్కరించారు. మాధవి మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో తన గెలుపులో రజకులు కీలక పాత్ర పోషించారని, వారి కృషిని ఎప్పటికి మరవబోనని మాధవి హామినిచ్చారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో రజకులను ఎస్సీల్లో చేర్చాలని చంద్రబాబు నాయుడు ప్రతిపాదనలు కూడా చేశారన్నారు. వారి సంక్షేమం కోసం దోబీఘాట్‌లతో పాటు పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసినట్లు చెప్పారు. టీడీపీ అధినేత చంద్రబాబు పేద ప్రజల సంక్షేమం కోసం పని చేశారన్నారు. రజక సంఘ నాయకులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

మానవత్వాన్ని చాటుతున్న మానవత స్వచ్ఛంధ సంస్థ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గత రెండు దశాబ్దాలుగా కోట్లాది మంది ప్రజలకు మానవత్వాన్ని పంచుతున్న ఏకైక సంస్థ 'మానవతా స్వచ్ఛంధ సేవా సంస్థ అని ఆ సంస్థ వ్యవస్థాపకులు ఎన్.రామ చంద్రారెడ్డి కొనియాడారు. ఆంధ్రప్రదేశ్‌లో 110 శాఖలతో 70 వేల మంది మానవత్వ సభ్యులతో నిర్విరామంగా కొనసాగుతుందన్నారు. గుంటూరులోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణ ంలో గల బాలాజీ కళ్యాణ మండపంలో మానవత వార్షిక సర్వ సభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ఎన్. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రజలు స్వచ్ఛందంగా సమాజ సేవలో భాగస్వాములు అయితే వారి ఆయు ప్రమాణాలు పెరుగుతాయన్నారు. మానవ సేవే మాధవ సేవగా ప్రతి ఒక్కరూ భావించి సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గుంటూరు మానవత సంస్థ రెండు సంవత్సరాలలోనే వెయ్యి మంది సభ్యులతో బహుముఖ కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ అసమానతల ల్యాబ్ ఇటీవల అందించిన గణాంకాల ప్రకారం భారత జనాభాలో పైనున్న 10 శాతం చేతుల్లో 50 శాతం సంపద ఉందని, అట్టడుగున ఉన్న 50 శాతం ప్రజల చేతుల్లో 10 శాతం సంపద మాత్రమే ఉందన్నారు. మానవత చైర్మన్ పావులూరి రమేష్ మాట్లాడుతూ మానవత సంస్థ గుంటూరులో గత రెండు సంవత్సరాల కాలంలో వృద్ధాశ్రమాలు, అనాధ శరణాలయాలకు అన్నదానాలు, వైద్య శిబిరాలు, అవయవదాన ప్రోత్సాహం, రక్తదాన శిబిరాలు, ప్రతిభ గల పేద విద్యార్థులకు ప్రోత్సహకాలు లాంటి బహుముఖ కార్యక్రమాలు నిర్వహించి, ప్రజల అభిమానాన్ని పొందగలిగామన్నారు. దాతల సహకారంతో విద్యానిధిని అభివృద్ధి చేసి, ప్రతిభ గల పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందిస్తామన్నారు. మానవత సర్వ సభ్య సమావేశ ప్రతినిధులందరూ ఏకగ్రీవంగా అధ్యక్షులుగా కొమ్మాలపాటి శ్రీనివాసరావు, కార్యదర్శిగా కె.సతీష్ బాబు, కోశాధికారిగా టీవీ సాయిరాంలను ఎన్నుకున్నారు. లక్ష రూపాయల నిధితో 'విద్యానిధి' కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభకు మానవత అధ్యక్షురాలు పి.విమల కుమారి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కె.జి శంకర్, మానవత నేతలు ఏ.రామానుజులురెడ్డి, వర్రె సుబ్రహ్మణ్యం, ఉప్పల సాంబశివ రావు, బీఎస్ మిత్ర, టి. ధనుంజయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి

విశాలాంధ్ర-తాడేపల్లి : మంగళగిరి నియోజకవర్గంలో అనేక సంవత్సరాలుగా ప్రభుత్వ భూముల్లో ఇళ్లు వేసుకొని నివాసం ఉంటున్న పేదల ఇళ్ళకు పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. ఆదివారం తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో రామారావు మాట్లాడారు. నియోజకవర్గంలో సుమారు 22 వేల కుటుంబాలు వివిధ రకాల ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్నారని, ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే నియోజకవర్గంలో పేదలకు ఇళ్ళ స్థలాలు, పట్టాలు మంజూరు చేస్తామని లోకేష్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. సీపీఎం పట్టణ నాయకులు కొట్టే కరుణాకరరావు, వేముల దుర్గారావు పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి విరాళం

విశాలాంధ్ర-పెదనందిపాడు : స్థానిక పీఏఎస్ కళాశాల అభివృద్ధికి ఎన్నారై డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు రూ.50 వేలు విరాళాన్ని ఆదివారం అందజేశారు. అమెరికా పర్యటనలో ఉన్న కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు విశ్రాంత ఏఎస్పీ కాళహస్తి సత్యనారాయణ కాలిఫోర్నియాలో డా. కొల్లా నాగేశ్వరరావును కలిసి విరాళాన్ని అందుకున్నారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

సీఎం సభా ఏర్పాట్లు పరిశీలన

విశాలాంధ్ర-గుంటూరు : తాడేపల్లి మండలం పెనుమాకలో జులై 1వ తేదీన ఉదయం 6 గంటలకు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటున్నందున ఇందుకు సంబంధించి ఏర్పాట్లను ఆదివారం సాయంత్రం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్‌లతో కలసి పరిశీలించారు. సభా స్థలి ప్రాంతంలో వేదిక, గ్యాలరీల నిర్మాణం, బ్యారీకేడ్లు, పార్కింగ్ ప్రదేశాలలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించి సూచనలు అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్‌కుమార్ మాట్లాడుతూ పింఛన్ల పంపిణీకి దాదాపు 1.30 లక్షల వరకు ప్రభుత్వ ఉద్యోగులను నియమించడం జరిగిం దని, రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు 65 లక్షల మంది లబ్దిదారులకు పింఛన్లు పంపిణీ చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించి జిల్లా కలెక్టర్లు అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేయడం జరిగింద న్నారు. నూతన ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ భద్రత పింఛన్లు పెంపుదల చేసి పెన్షన్‌తో పాటు మూడు నెలల బకాయిలు కలిపి సోమవారం నుంచి రూ.7 వేలు రాష్ట్రంలోని సుమారు 65 లక్షల మందికి పంపిణీ చేయటం జరుగు తుందన్నారు. ఆగస్టు మాసం నుంచి రూ.4 వేలు పింఛన్ అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పీడీ డీఆర్‌డీఏ హరిహరనాథ్ పాల్గొన్నారు.

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్న పెమ్మసాని

విశాలాంధ్ర-గుంటూరు : తన తొలి అడుగు నవ శకానికి నాంది అంటూ రాజకీయ అరంగేట్రం చేసి తనను గెలిపిస్తే జిల్లాను అన్ని విధాలా అగ్రస్థానంలో నిలబెడతానంటూ ప్రజలకిచ్చిన మాటను కేంద్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసి నెల తిరగకముందే పెమ్మసాని చంద్రశేఖర్ నిలబెట్టుకుంటున్నారని జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో పెమ్మసాని చంద్రశేఖర్‌ను ఆళ్ళ హరి కలిసి అభినందనలు తెలిపారు. పార్లమెంట్ సభ్యుడిగా తనకు రికార్డు మెజారిటీ ఇచ్చిన జిల్లా ప్రజల ఋణాన్ని పెమ్మసాని తీర్చుకుంటున్నారని కొనియాడారు. విద్య, వైద్యంతో పాటూ సమగ్ర అభివృద్ధిపై పెమ్మసాని దృష్టి పెట్టడం ఎంతో ముదావహం అన్నారు. వరుస సమీక్షలతో అధికారులను పరుగులు పెట్టించటమే కాకుండా దశాబ్దాలుగా బూజు పట్టిన ఫైళ్లను బయటకు తీపిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఒక వైపు రాష్ట్ర ముఖ్యనేతలతోనూ మరోవైపు కేంద్రంలోని ప్రముఖులతోనూ నిరంతరం చర్చిస్తూ జిల్లాలో ఆగిపోయిన అభివృద్ధి పనులు తిరిగి ప్రారంభమయ్యేలా కృషి చేస్తున్నారన్నారు. ఏడు దశాబ్దాలుగా ప్రజలు కోరుకుంటున్న శంకర్ విలాస్ బ్రిడ్జ్ సమస్యకు త్వరలోనే పెమ్మసాని మోక్షం కలిగించనున్నారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించటంలోనూ అభివృద్ధి పనుల్లోనూ క్షేత్రస్థాయిలో దూసుకుపోతున్న పెమ్మసాని చిత్తశుద్దిని ప్రజలు వేనోళ్ల మెచ్చుకుంటున్నారని హరి అన్నారు. చంద్రశేఖర్‌ను కలిసిన వారిలో జనసేన పార్టీ నేతలు సయ్యద్ షర్ఫుద్దీన్, సాయి, పాల్గొన్నారు.

లౌకికవాద రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా పాఠ్య ప్రణాళికలు రూపొందించటం సరికాదు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : లౌకికవాద రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా పాఠ్య ప్రణాళికలు రూపొందించే విధానం చరిత్రకు నష్టం కలిగిస్తుందని, దేశంలో కోట్లాదిమంది విద్యార్ధులు అభ్యసించే ఎన్‌సీఈ ఆర్‌టీ' పాఠ్య పుస్తకాల్లో మతవాద పూరితమైన భావజాలాన్ని చూపించాలనే ప్రయత్నాలు సరికాదని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థి సమూహానికి దేశంలోని భౌగోళిక పరిస్థితులు, సామాజిక పరిస్థితులు చరిత్ర వాస్తవంగా ఉన్నది..ఉన్నట్లుగా అర్థం కావాల్సి ఉందన్నారు. పాఠ్య పుస్తకాలు రూపొందించిన వారి అనుమతి లేకుండా ఎన్‌సీఈ ఆర్‌టీ అధికారులు పాఠ్యాంశాలను మార్చేయటం జరుగుతుందని, చరిత్రలో వాస్తవ ఘట్టాలను తొలగించి కల్పిత కథలను చేర్చి వాస్తవ ఆధునిక రాజకీయ చరిత్ర పేరుతో విద్యార్థులకు అందజేయటం సరికాదని ఆయన అన్నారు.

డాక్టర్ అరుణ్‌కుమార్‌కు 'డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఇన్స్పిరేషనల్ అవార్డు-2024'

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ న్యూరో అండ్ స్పైన్ సర్జన్ డాక్టర్ పద్మనాభుని అరుణ్ కుమార్‌కు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఇన్స్పిరేషనల్ అవార్డు 2024 లభించింది. టాప్ నాచ్ ఫౌండేషన్ అనే సంస్థ హెల్త్ కేర్ రంగంలో ప్రత్యేక నైపుణ్యం కనబరిచిన వ్యక్తులను ఎంపిక చేసి ఈ అవార్డును అందజేస్తుంది. ఈ పురస్కారానికి దేశవ్యాప్తంగా 1200 మంది ఎంపిక అవ్వగా అందులో టాప్ నాచ్ ఫౌండేషన్ 58 మంది ఎంపిక చేశారు. అందులో ఆంధ్రప్రదేశ్ నుంచి డాక్టర్ అరుణ్ కుమార్ ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. డాక్టర్ అరుణ్ కుమార్ కోవిడ్ సమయంలో అందించిన సేవలకు.. అత్యవసర సమయంలో క్లిష్టమైన ఆపరేషన్..రోగుల అభిప్రాయాలను సేకరించి ఈ అవార్డును ప్రధానం చేశారు. డాక్టర్ అరు కుమార్ ఆర్మడ్ ఫోర్స్ మెడికల్ కాలేజ్ పూనే నందు ఎమ్మెస్ ఎంసీహెచ్ పూర్తి చేసి రమేష్ హాస్పిటల్స్ నందు ఏడు సంవత్సరాల అనుభవంతో మొత్తంగా 9వేల ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేశారు. న్యూఢిల్లీ రాజ్ భవన్ నందు శనివారం ఈ అవార్డు సతీష్ చంద్ర దుబే మినిస్ట్రీ ఆఫ్ స్టేట్ ఆఫ్ కోల్ అండ్ మైన్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, మిస్ హేమా మాలిని బాలీవుడ్ యాక్టర్స్ అండ్ పార్లమెంట్ మెంబర్, మిస్ బన్ సూరి స్వరాజ్ నంబర్ ఆఫ్ పార్లమెంట్ అండ్ ఇండియన్ లాయర్, డాక్టర్ ఠాకూర్ రఘురాత్ సింగ్ మినిస్ట్రీ ఆఫ్ హెడ్‌ఫర్ లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్ గవర్నమెంట్ ఆఫ్ ఉత్తరప్రదేశ్, సంజయ్ మయోగ్ ఇండియన్ పొలిటీషియన్ అండ్ భారతీయ జనతా పార్టీ నేషనల్ షోకేస్ పర్సన్, శ్యామ్ జాజు ఎస్ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ ఆఫ్ బీజేపీ చేతుల మీదుగా డా. అరుణ్ కుమార్ అందుకున్నారు.

1న ఆలయ హుండీ లెక్కింపు

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరిలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం పరిధిలోని ఎగువ, దిగువ సన్నిధులు శ్రీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు సమర్పిం చిన కానుకలు, నగదుకు సంబంధించి హుండీ లెక్కింపు 1వ తేదీ ఉదయం 9 గంటలకు జరుగుతుందని దేవస్థానం సహాయ కమిషనర్ ఎ.రామకోటి రెడ్డి ఆదివారం తెలిపారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

అమ్మవారి సేవలో.. జాయింట్ కలెక్టర్

విశాలాంధ్ర-దుర్గి : మండల పరిధిలోని నిదానంపాడు అగ్రహారంలో వేం చేసియున్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం, మహాశక్తి పీఠం నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారిని ఆదివారం పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ దంపతులు దర్శించుకున్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖా అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, వారిని అమ్మవారి సన్నిధికి తీసుకెళ్ళారు. అర్చకస్వాములు జేసీ దంపతులకు ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం జేసీ దంపతులు, తహశీల్దార్‌లను ఆలయ కమిటీ ఛైర్మన్ యాగంటి వెంకటేశ్వర్లు పూలమాలలు, శేష వస్త్రంతో సన్మానించగా, అర్చకులు వారికి అమ్మవారి జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జి. రజనికుమారి, ఇన్‌ఛార్జ్ ఆర్ఐ. తిరునగిరి జీరయ్య, విఆర్‌ఏలు మస్తాన్‌వలి, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

నేడు భాష్యం ప్రవీణ్ పెదకూరపాడు రాక

విశాలాంధ్ర-పెదకూరపాడు: పెదకూరపాడు నియోజవర్గ శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ ఈనెల 1వ తేదీన పెన్షన్ పంపిణీ చేసేందుకు పెదకూరపాడు రానున్నట్లు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆర్తిమళ్ళ రమేష్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. 20 గ్రామాల్లో సచివాలయ అధికారులు, తెలుగుదేశం పార్టీ ముఖ్య నేతలు పాల్గొని పెన్షన్ పంపిణీ చేయాలని రమేష్ కోరారు.

ఎన్ఎస్పీ వర్క్ ఇన్‌స్పెక్టర్ నందకిషోర్ సేవలు అభినందనీయం

విశాలాంధ్ర-శావల్యాపురం : ఎన్ఎస్పీ వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా అనిశెట్టి నందకిషోర్ అందించిన సేవలు అభినందనీయమని గంటవారిపాలెం సెక్టార్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోట్లూరి లక్ష్మీనారాయణ కొనియాడారు. మండలంలోని గంటవారిపాలెం అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో 34 ఏళ్ళ పాటు వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించి ఆదివారం పదవీ విరమణ పొందిన నంద కిషోర్‌ని గంట వారి పాలెంలోని ఎన్ఎస్పీ కార్యాలయంలో ఏఈఈ, ఎన్ఎస్పీ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఏఈఈ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో రైతులకు నందకిషోర్ నిరంతరం అందుబాటులో ఉండి వారికి ఉన్నతమైన సేవలు అందించారని, రైతులకు ఎప్పటికప్పుడు ముందస్తు సమాచారం అందించి తాగు, సాగునీరు అందరికీ అందేలా కృషి చేశారన్నారు. నందకిషోర్‌ను ఆదర్శంగా తీసుకొని మిగిలిన వర్క్ ఇన్‌స్పెక్టర్లు కూడా రైతులకు మంచి సేవలందించాలని అన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎంవీ రమణ, లస్కర్లు వెంకటేశ్వర్లు, సీతా రామాంజనేయులు, దేవకాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

భవాని శంకర్ పదవీ విరమణ

విశాలాంధ్ర- వినుకొండ : వినుకొండ పట్టణంలో రైల్వే స్టేషన్ ఆవరణలో ఆదివారం రైల్వే ఉద్యోగి అయిన కమర్షియల్ సూపర్వైజర్ చామర్తి భవాని శంకర్ పదవీ విరమణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రైల్వే ఉద్యోగులు, బంధుమిత్రులు, విను కొండ పట్టణ ప్రముఖులు అందరూ పాల్గొని భవాని శంకర్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లికార్జునరావు భవాని శంకర్ ని వారి సతీమణి కామేశ్వరి ని పూలతో శాలువాలతో సత్కరించి, హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మానవ సేవ సమితి పీవీ సురేష్ బాబు మాట్లాడుతూ మానవ సేవా సమితి రూపకర్త భవాని శంకర్ అని సమాజా హితం కోరే భవాని విరమణ తర్వాత సేవా కార్యక్రమాల్లో మరియు వారి కుటుంబ సభ్యులతో తమ శేష జీవితాన్ని గడపాలని ఆయన సేవలను కొనియాడారు. మార్క్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రముఖ న్యాయవాదులు డాక్టర్లు అనేక సేవా సంస్థల ప్రతినిధులు తదితరులు అందరు పాల్గొని భవాని సేవలు చరస్మరణీయమని వినుకొండ పట్టణ అభివృద్ధిలో భాగస్వాములుగా శేష జీవితాన్ని గడపాలని అందరూ కొనియాడారు.

అబ్బూరి వెంకటేశ్వర్లు పదవీ విరమణ

విశాలాంధ్ర-వినుకొండ : వినుకొండ తహసీల్దార్ కార్యాలయం నందు ఆదివారం డిప్యూటీ తహసీల్దారుగా విధులు నిర్వహిస్తున్న అబ్బూరి వెంకటేశ్వర్లు పదవి విరమణ మహోత్సవ కార్యక్రమాన్ని కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. సభా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లికార్జు నరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మక్కెన మాట్లాడుతూ గత 33 సంవత్సరాలుగా వివిధ ప్రాంతాలలో విధులు నిర్వహించి గత ఏడు సంవత్స రాలుగా వినుకొండ డిప్యూటీ తహసీల్దార్‌గా ఎంతో అంకితభావంతో విధులు నిర్వహించి నిస్వార్థంతో ప్రజలకు రైతులకు సేవలు అందించారని కొనియా దారు. అనంతరం అబ్బూరి దంపతులను దుశ్శాలువ పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి. బ్రహ్మయ్య, వినుకొండ ఎంపీపీ వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్ దానియేలు, లాయర్లు రామకోటేశ్వరరావు, వీఆర్వోలు, వీఆర్ఏలు గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నవ దుర్గాప్రసాద్ జన్మదిన వేడుకలు



విశాలాంధ్ర-మంగళగిరి : ప్రగడ నవ దుర్గాప్రసాద్ జన్మదిన వేడుకలు చిన కాకానిలోని ఫైన్ ఆనంద శరణాలయంలో ఘనంగా జరిగాయి. జన్మదిన వేడుకల్లో జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావుతో కలిసి నవ దుర్గాప్రసాద్ ఫైన్ ఆనంద శరణాలయంలో చిన్నారులతో కేక్ కట్ చేశారు. చిన్నారులకు అన్నదానం ఏర్పాటు చేశారు. నవ దుర్గాప్రసాద్ జన్మదిన వేడుకలలో ఏపీడబ్ల్యూజే మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి బత్తుల సాంబశివరావు, ప్రగడ బ్రహ్మేశ్వరి, శిరీష, శ్రీనివాస తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేపట్టాలి

- జిల్లా జాయింట్ కలెక్టర్‌ను కోరిన సీపీఐ నాయకులు

విశాలాంధ్ర-నరసరావుపేట : గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల పరిధిలో లక్షలాది ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందిస్తున్న నాగార్జున సాగర్ కుడికాలువకు, మేజర్, మైనర్ కాలువలకు మరమ్మతులు చేపట్టాలని సీపీఐ నాయకులు జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌ను కోరారు. ఈ మేరకు పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సీపీఐ నాయకులు జేసికి వినతిపత్రం అందజేశారు. నాగార్జునసాగర్ కాలువ నాలుగు జిల్లాలలో సుమారు 14 వేల కిలోమీటర్ల పరిధిలో 12 లక్షల ఎకరాలకు సాగునీరు, లక్షలాది మందికి తాగునీరు అందజేస్తుందని, ఈ కాలువలకు గత ఐదేళ్లుగా మరమ్మతులు చేపట్టలేదని, కాలువ కట్టలు కుంగిపోయి, కాలువల్లో పూడిక పేరుకుపోయి, డ్రాపులు పగిలిపోయి, కాలువలకు నీటిని విడుదల చేసే గేట్లు విరిగిపోయి అస్తవ్యస్తంగా ఉన్నాయని అన్నారు. కాలువలు మరమ్మత్తులు చేపట్టకపోతే రానున్న కాలంలో సాగు, తాగునీరు అందక రైతులు, ప్రజలు ఇబ్బందులు పడతారని యుద్ధ ప్రాతిపదికపై కాలువల్లో పూడిక తీయించి మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఖరీఫ్ వ్యవసాయ సీజన్ ప్రారంభమైందని, రైతులకు నాణ్యమైన విత్తనాల, ఎరువులు అందేవిధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, ఏరియా కార్యదర్శి ఉప్పలపాటి రంగయ్య, పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, చిన్న జాను సైదా పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సన్మాన సభ

విశాలాంధ్ర-తెనాలి : తెనాలి ఆర్టీసి డిపో కండెక్టర్, ఎంప్లాయీస్ యూనియన్ గుంటూరు జిల్లా కమిటీ మహిళా కార్యదర్శి జి.పోలేరమ్మ పదవీ విరమణ సందర్భంగా ఆదివారం తెనాలి ఆర్టీసి డిపో ఆవరణలో కార్మికులు, ఆర్టీసి సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీజేఏసీ అమరావతి సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, ఆర్టీసిలో ఎంప్లాయిగా ఆమె చేసిన సేవలు మరువలేనివని, ఆమె వృత్తిరీత్యా ఎక్కువ సమయం కేటాయించి అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూని యన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందపాటి శంకర రావు, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యన్‌వి కృష్ణారావు, జోన్ అధ్యక్షుడు వాకా రమేష్‌లు ఆమె సేవాతత్ప రతను కొనియాడుతూమాట్లాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి యం.హను మంతరావు మాట్లాడుతూ, ఉద్యోగరీత్యా చేసిన సేవలే కాక కార్మికుల సమస్యల పరిష్కారంలో ఏఐటీయూసీకి సహకరిస్తూ వుండేవారని, ఆమెకు సన్మానం చేయడం అభినందనీ యమని చెప్పారు. గుంటూరు జిల్లాలో వున్న అన్ని డిపోలలోని కార్మికులు, ఉద్యోగులు, ఆఫీస్ సోదరులు పాల్గొని ఆమె దంపతులను సన్మానించారు.

టీచర్లకు వర్క్‌షాప్ నిర్వహణ



విశాలాంధ్ర-మాచర్ల: రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్, ఐది మాస్టర్ మైండ్స్ పాఠశాలల వ్యవస్థాపకులు ఎస్ రాజు ఆధ్వర్యంలో హైదరాబాద్ వనస్థలిపురంలో ఆదివారం టీచర్లకు వర్క్ షాప్ నిర్వహించినట్టు కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ హనుమంతరావు తెలిపారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్‌ఛార్జ్ మహమ్మద్ కలీం, ప్రిన్సిపాల్ హనుమంతరావు మాట్లాడుతూ మారుతున్న పోటీ ప్రపంచంలో విద్యార్థులు మైండ్ సెట్ కి అనుగుణంగా నూతన విద్యా విధానం ద్వారా సులభ రీతిలో చదువును అభ్యసించడం జరుగుతుందన్నారు. తద్వారా పోటీ పరీక్షల్లో సైతం తమ కృష్ణవేణి టాలెంట్ స్కూల్స్ విద్యార్థులు కూడా ముందంజలో ఉండాలనే భావంతో, ప్రతి సంవత్సరం నూతన విద్యా విధానం అలవోకగా అర్ధంచేసుకోవడానికి ప్రతి ఒక్క టీచర్లకు వర్క్ షాప్ నిర్వహించడం జరుగుతుంద న్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, పాఠశాల ఇన్చార్జిలు గౌరీ, నాగజ్యోతి, బాజీ, శ్రీలక్ష్మి రెడ్డి, అంజి నాయక్ తదితర పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జూలకంటిని కలిసిన డీబీఎఫ్ టీమ్

విశాలాంధ్ర-దుర్గి : మాచర్ల నియోజకవర్గ చరిత్రలో రికార్డ్ స్థాయిలో మెజార్టీ సాధించిన జూలకంటి బ్రహ్మానందరెడ్డిని వెల్దుర్తి లోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం దళిత బహుజనఫ్రంట్ పల్నాడు జిల్లా జనరల్ సెక్రెటరీ వడ్డె మధుసూదనరావు, టీం సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మధుసూదనరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో ఏపీకి రాజధాని నిర్మాణం లేక, రాష్ట్రంలోని చదువుకున్న నిరుద్యోగులకు, ఉద్యోగాలు లేక అందరూ రోడ్డున పడ్డారని, పొట్ట చేత పట్టుకుని ఇతర రాష్ట్రాలకు తక్కువ జీతాలకు వలసలకు వెళ్లడం జరిగిందన్నారు. సరైన పనులు లేక అన్ని రంగాల ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారని, సంక్షేమ పథకాలతో ప్రజలను బిక్షగాలుగా చేశారని, దళితులపైనే, ఎస్సీ, ఎస్టీ కేసులను పెట్టి, దళితులను టార్గెట్ చేసి హత్యలు, దాడులు, దౌర్జన్యాలు చేస్తూ మాస్క్ అడిగిన దళిత డాక్టర్ సుధాకర్‌ను చంపడం దగ్గర నుంచి కార్ డ్రైవర్ దళిత సుబ్రమణ్యంను చంపి డోర్ డెలివరి చేసిన ఎమ్మెల్సీ వరకు, అకృత్యాలు, "ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను," నవరత్నాలకు మళ్లించి, ఈ నిధులను' పప్పు, బెల్లాలు పంచినట్టు ' అన్ని వర్గాలకు పంచడం జరిగిందని, "ఎస్సీ, ఎస్టీలకు 27 పథకాలను రద్దుచేసి, రాష్ట్రంలో దళితులం దరినీ మోసం చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. చెత్తపై కూడా పన్ను వేసిన చెత్త ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని, ఈ పాలనకు నిరసనగా దళిత బహుజనఫ్రంట్ జాతీయ నాయకులు మేళ్ళం భాగ్యారావు, కాపునాడు, దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వైసీపీని ఓడిద్దాం. అమరావతిని నిర్మిద్దాం' అనే నినాదంతో ప్రచారం చేయడం జరిగింది. అందులో భాగంగా నరసరావుపేట నియోజకవర్గం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు సహకారంతో, ఎంపీకి, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డికి మద్దతుగా 2024 ఏప్రిల్ నెల 19వ తేదీ నుంచి 2024 మే నెల 10వ తేదీ వరకు నియోజకవర్గంలోని 5 మండలాల్లో గల 50 గ్రామాలలోని మాల, మాదిగలను పల్నాడు జిల్లా దళిత బహుజన ఫ్రంట్ టీంతో విస్తృతంగా ప్రచారం చేసి, 7వేల కరపత్రాలను పంచటం జరిగిందని ఈ సందర్భంగా అన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో డీబీఎఫ్ దుర్గి మండల అధ్యక్షురాలు చల్లా సంపూర్ణమ్మ, మాచర్ల మండలం నాయకులు నరమాల చంద్రయ్య, కల్లు జయన్న, సైదయ్య, కోటయ్య, కె. వెంకటేశ్వర్లు ఉన్నారు.

నేడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుల స్వీకరణ

విశాలాంధ్ర-అమరావతి : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం(పబ్లిక్ గ్రీవాన్స్ రీ అడ్రస్సల్ సిస్టం) సోమవారం అమరావతి పోలీస్ స్టేషన్‌లో నిర్వహించనున్నట్లు అమరావతి సీఐ ఏవీ బ్రహ్మం ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుంచి పోలీస్ స్టేషన్‌లో మండల ప్రజలు సమస్యలపై ఫిర్యాదు చేసుకొనవచ్చన్నారు. ఈ కార్యక్రమం ప్రతి సోమవారం అమరావతి పోలీస్ స్టేషన్‌లో నిర్వహించడం జరుగుతుందని, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఐఎంఏ ఆధ్వర్యంలో సీఎంఈ ప్రోగ్రాం

విశాలాంధ్ర-నరసరావుపేట: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నరసరావుపేట బ్రాంచి ఆధ్వర్యంలో ఆదివారం ఐఎంఏ కార్యాలయంలో సీఎంఈ ప్రోగ్రాం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నరసరావుపేట శాసనసభ సభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు, విశిష్ట అతిథిగా పల్నాడు జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి హాజరైనారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి శాసనసభ సభ్యులు అరవింద్ బాబు మాట్లా డుతూ నరసరావుపేట లోని సీఎంఈ కార్యక్రమం నిర్వహించడం చాలా మంచి విషయం అని, డాక్టర్లు పుస్తకాలు చదవటంతో పాటు ఈ కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా కొత్త విషయాలను నేర్చుకోవచ్చని తెలియజేశారు. నరసరావుపేటలో లాభాపేక్ష లేకుండా సేవ చేసిన డాక్టర్స్ చాలామంది ఉన్నామని మాలాగే మీరు కూడా లాభాపేక్ష లేకుండా వైద్య సేవలు అందించాలని కోరారు. వైద్య వృత్తిలో సేవలు అందించిన వారికి నరసరావుపేట నుండి ప్రజా సేవ చేసే అవకాశం ప్రజలు కల్పించారని వారిలో డాక్టర్ కోడెల శివప్రసాదరావుకి నాలుగుసార్లు, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డికి రెండుసార్లు, అదేవిధంగా నన్ను ప్రజలు అసెంబ్లీకి పంపించారని ప్రజలు ఇచ్చిన ఈ అవకాశాన్ని నేను బాధ్యతతో నిర్వహిస్తానని తెలియజేశారు. మారుమూల ప్రాంతాలలో కూడా ఎంతోమంది వైద్యులు వైద్య సహాయం అందిస్తు న్నారని డాక్టర్లు 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటారని, అర్ధరాత్రి అయినా వారికి అందు బాటులో ఉంటామని అలాంటి వాళ్లలోనే డాక్టర్ మన్యం రవీంద్ర ఎర్రగొండపాలెం, జాన్సన్, బెంజిమెన్ ఉన్నారని తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా డాక్టర్స్ డే సందర్భంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ మర్రి పెద్దయ్య, డాక్టర్ చదలవాడ అరవింద బాబులను ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ కంజుల జగన్ మోహన్ రెడ్డి నిర్వహించగా, డాక్టర్ సూర్య నారాయణ పర్యవేక్షణ చేశారు. కార్యక్ర మంలో నరసరావుపేటలోని పలువురు ప్రముఖ వైద్యులు , సిబ్బంది, పాల్గొనడం జరిగింది.

నియోజకవర్గ పద్మశాలి సంఘ అధ్యక్షునిగా చెన్నంశెట్టి బాజీ

విశాలాంధ్ర-పెదకూరపాడు: నియోజకవర్గ పద్మశాలి సంఘ అధ్యక్షుడిగా పెద్దకూరపాడు గ్రామానికి చెందిన చెన్నంశెట్టి బాజీ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల పరిధిలోని లగడపాడు గ్రామంలో నియోజకవర్గ పద్మశాలి సంఘం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు కాకుమాను రమేష్, ప్రధాన కార్యదర్శి చిల్లాపల్లి సత్యం చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు సంఘ నాయకులు మాట్లాడుతూ ఒక సామాన్య చేనేత కుటుంబంలో జన్మించి పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్న చందాన బాల్యం నుండే సమాజం పట్ల పరిసరాలపట్ల అవగాహన కలిగి తనదైన శైలిలో ప్రతి ఒక్కరికి తన సహాయ సహకారాలు అందిస్తూ అజాత శత్రువుగా అందరితో తలలో నాలుకలా మెలుగుతూ సంఘ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ అందరి మన్ననలు పొంది అంచెలంచెలుగా ఎదిగి పద్మశాలి సంఘ నియోజకవర్గ అధ్యక్షునిగా ఎన్నికైన చెన్నంశెట్టి బాజీ అభినందనీయులు, ఆదర్శప్రాయులని కొనియాడారు. అనంతరం బాజీ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో చేనేత రంగంలో పద్మశాలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతూ ఎప్పటికప్పుడు వాటి పరిష్కారానికి కృషి చేస్తూ సంఘ సభ్యులను సమన్వయం చేసుకుంటూ వారికి అండగా ఉంటూ నాపై ఉంచిన బాధ్యతను నెరవేర్చడంలో శక్తివంచన లేకుండా న్యాయం చేస్తానని తెలియజేశారు. పద్మశాలి సంక్షేమ సంఘంలో ఉన్న అనుబంధ వృత్తులైనటువంటి వ్యవసాయం భవన కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కూడా తన తోడ్పాటు అందిస్తానని తెలిపారు. ఏకగ్రీవంగా ఎన్నికైన బాజీని సంఘ నేతలు దుశ్శాలువాలతో, పుష్పగుచ్చాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గోలి ఎలమంద, అనుముల వెంకటరావు, నక్క మల్లికార్జునరావు, బండారు వెంకటేశ్వర్లు, అనుముల సామ్రాజ్యం, కాటాబత్తిని శ్రీనివాసరావు, పనిధెరపు బ్రహ్మం, నందం సాయి, జిల్లా శ్రీనివాసరావు, నంద్యాల వేణు, చిల్లాపల్లి పానయ్య, అనుముల ప్రసాదు, సందెపు సాంబయ్య తదితర జిల్లా నియోజకవర్గ మండల నాయకులు కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ సర్టిఫికెట్లు అందజేత

విశాలాంధ్ర-తాడేపల్లి : కంప్యూటర్ కోర్స్‌లలో శిక్షణ పొందిన విద్యార్థులకు ఆదివారం ఉదయం ఎంటీఎంసీ పరిధిలోని కొలనుకొండ మోటూరు ఉదయం ట్రస్ట్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లను నిర్వాహకులు అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ మే 1వ తేదీ నుంచి విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి నట్లు ఆమె తెలిపారు. ఉదయం ట్రస్ట్ పేరుతో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు వేసవి సెలవులలో విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ కోర్సులు నిర్వహించామని అన్నారు. రాబోయే రోజులలో ఆదివారాలలో శిక్షణ ఇవ్వను న్నట్లు ఆమె తెలిపారు. అంతేకాకుండా చిన్న పిల్లలకు లైబ్రరీ, కథలు చెప్పుకుందాం అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ కంప్యూటర్ శిక్షణ తరగతులలో శిక్షణ తీసుకొని తమ తమ నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జి.అమలాశ్రీ, శ్రీదేవి పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర-వినుకొండ : వినుకొండ నియోజకవర్గం ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. పట్టణం లోని హనుమాన్ నగర్ వద్ద వాటర్ ప్లాంట్ నందు గౌరవ అధ్యక్షుడు రెడ్డినగేష్ (ఐ న్యూస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా యార్లగడ్డ రామమోహన్‌రావు (బుజ్జి) (99 టీవీ), వైస్ ప్రెసిడెంట్ పఠాన్ యూసఫ్ ఖాన్ (సిటీ న్యూస్) ప్రధాన కార్యదర్శిగా ములక తులసీరామ్(భారత్ టుడే), సహాయ కార్యదర్శి యలమంచిలి రమేష్ బాబు(6టీవీ) కోశాధికారిగా అరవపల్లి సైదారావు (రాజ్‌టీవీ), గౌరవ సలహాదారుడిగా కే. సుబ్బారావు (టీవీ5) న్యాయ సలహాదారునిగా చంద్రం (సిటీ న్యూస్) సభ్యులుగా మర్రెడ్డి బాబు, పసుమర్తి శ్రీను, పెద్దిశెట్టిదుర్గా, నడికుడి సాంబ శివరావు, ఏవి నారాయణ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు.

పోటీ పరీక్షలకు ప్రాథమిక స్థాయి నుంచి శిక్షణ పొందాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: అకాడమిక్ విద్యతో పాటు, పోటీ పరీక్షలకు ప్రాథమిక తరగతుల నుండే ప్రిపేర్ అవ్వవచ్చు అని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కాంపిటేటివ్ కోచింగ్ సెంటర్ వ్యవస్థాపకులు షేక్. జాఫర్ అన్నారు. ఆదివారం ఉదయం శాఖా గ్రంథాలయం నందు, ముగ్గురు ప్రైవేట్ పాఠశాల విద్యార్థు లకు సత్కారం నిర్వహించడం జరిగింది. ఇటీవల ముగ్గురు విద్యార్థులు బ్రాగ్ సెట్, ఏపీఆర్ఎస్ పోటీ పరీక్షలలో ఉత్తీర్ణులై, సీట్లు సాధించారు. మంచి ప్రణాళికతో పాటు, మేళకువలు నేర్చుకొని, పోటీ పరీక్షలలో విజయాలు సాధించవచ్చని ప్రముఖ సాఫ్ట్వేర్ ఇంజనీర్ షేక్ మస్తాన్వలి విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. షేక్ యాసిన్, షేక్ ఖాసిం, షేక్ హర్షద్ విద్యార్థులకు మెమొంటో, ఇంగ్లీష్ నిఘంటువుతో పాటు సత్కరించారు. ఈ కార్యక్రమంలో షేక్ కాలేషా, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎంపికైన సువర్చల

విశాలాంధ్ర-వినుకొండ : భారతదేశ వ్యాప్తంగా ఐఏఎస్, ఐపీఎస్‌లు, డాక్టర్లు, ఇంజనీర్లను తయారుచేసిన డాక్టర్ లక్ష్మయ్య విద్యాసంస్థలు వినుకొండలో తమ సంస్థలను ప్రారంభించి, గత నెలలో ప్రకటించిన సివిల్స్ ఫలితాలలో మొదటి ర్యాంకును కైవసం చేసుకోవటమే కాకుండా ఇటీవల ప్రకటించిన గ్రూప్ వన్, గ్రూప్ టు ఫలితాలలో విజయభేరి మోగించిన విషయం విధితమే. ఇతర రాష్ట్రాల నుండి ప్రాంతాల నుండి అనేకమంది విద్యార్థిని, విద్యార్థులు ఇక్కడే ఉన్న భ్రమర టౌన్ షిప్ నందు తయారవుతున్నారని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో గుజరాత్‌లోని వడోదర విశ్వ విద్యాల యంలో చదువుకున్న కుమారి సువర్చల, అనంతపురంలోని అగ్రికల్చర్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎంపికైన సందర్భంగా ఆదివారం వినుకొండలోని డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ నందు విద్యార్థులు, ఉపాధ్యాయులు బృందం కుమారి సువర్చలను దుశ్శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సువర్చలా మాట్లాడుతూ తన విజయంలో డాక్టర్ లక్ష్మయ్య పాత్ర మరువలేనిదని వారి సహాయ సహకారాలతో సాధించాలని త్వరలో ఐఏఎస్ గా ఎంపికయి డాక్టర్ లక్ష్మయ్య ద్వారా సన్మానం చేయించుకుని వినుకొండ నుండి వెళ్తానని శపథం చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ లక్ష్మయ్య అడ్మిన్ డైరెక్టర్ మరియు అకాడమిక్ డైరెక్టర్ ఫంకస్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం

విశాలాంధ్ర- వినుకొండ : స్థానిక వెల్లటూరు రోడ్డులోని హనుమాన్ నగర్ జీరో లైన్ వద్ద ప్రయాణికులతో ఉన్న లారీ మలుపు తిరుగుతూ మున్సిపల్ నీరు సరఫరా అయ్యే పైప్ లైన్‌కు బిగించిన వాల్ గుంతలో లారీ ముందు టైరు దిగబడడంతో లారీ ఒక్కసారిగా గుంతలో కృంగిపోయింది. దీంతో లారీలో ఉన్న ప్రయాణికులు ఒకసారిగా భయంతో కేకలు వేశారు. లారీ డ్రైవర్ సమయస్పూర్తిగా వ్యవహరించి లారీని ఇంజన్ ఆపివేయడంతో ప్రయాణికులు వెంటనే క్రిందకు దిగారు. గుంతపై బండ ఉన్నప్పటికీ లారీ బరువుకు ఓ పక్కకు జరిగిపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు లారీ డ్రైవర్ తెలిపాడు. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమం

విశాలాంధ్ర- వినుకొండ : భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన్ కీ బాత్ (మనసులో మాట) కార్యక్రమం భాగంగా ఆదివారం భారతీయ జనతా పార్టీ పట్టణ కార్యాలయంలో జరిగింది. నరేంద్ర మోదీ మన రాష్ట్రం లోని అరకు కాఫీ గురించి, కేరళలోని గొడుగులు తయారీ గురించి, జమ్మూకాశ్మీర్‌లోని కూరగాయలు లండన్‌కి పంపించడం గురించి, కువైట్లో ఒక మహిళ యోగశిక్షకురాలుగా మారిన విషయం గురించి దేశంలోని అన్ని ప్రాంతాల్లో జరుగుచున్న అభివృద్ధిని గురించి వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ యార్లగడ్డ లెనిన్ కుమార్, పట్టణ అధ్యక్షులు ఆడిటర్ రాఘవులు, జిల్లా కార్యదర్శి శ్రీమతి సుజాత పట్టణ ఉపాధ్యక్షులు సుధా గణేష్ బాబు, గర్రె రామచంద్రరావు, కోశాధికారి దేవతి చిన్న నరసింహారావు, గర్రే ప్రతాప్ అవ్వారి శంకర్రావు అప్పల రాజా కంచర్ల వీరభద్రాచారి కొల్లిపర రామ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

వేముల నాగయ్యకు సన్మానం



విశాలాంధ్ర-మాచర్ల: ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చి రెంటచింతల, మాచర్ల, దుర్గి మండలాల విద్యాశాఖాధికారిగా సేవలందించి పదవీ విరమణ వేముల నాగయ్యను మదర్ థెరిస్సా సేవా సమితి సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు జక్కిరెడ్డి మర్రెడ్డి, గాదె కిరీటిరెడ్డి మాట్లాడుతూ నాగయ్య వృత్తి పట్ల అంకితభావంతో పనిచేసేవారన్నారు. దశాబ్ది కాలంగా మండల విద్యార్థిధికారిగా సేవలందించి ఉన్నతాధికారులచే ఎన్నో ప్రశంసలు పొందారన్నారు. తోటి ఉపాధ్యాయులకు ఆయన ఆదర్శమన్నారు. కార్యక్రమంలో న్యాయవాది చిలమకూరి నాగిరెడ్డి, ముత్యాల పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.